విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

గురువారం 06 నవంబరు 2025 8 పేజీలు

మళ్లీ భయపెడుతున్న వర్షాలు..

- 'మొంథా' నుంచి తేరుకోని గ్రామాలు
- మరో అల్పపీడనంతో ఆందోళన
- ఇంకా నీటిలోనే పంట పొలాలు
- దెబ్బతిన్న రోడ్లు, కాలువలు
- జిల్లాలో పలు చోట్ల మోస్తరు వర్షం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : బంగాళాఖాతంలో ఏర్పడిన మరో వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రానున్న రెండు మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మొంథా తుపాను ప్రభావంతో జిల్లాకు భారీ నష్టం వాటిల్లింది. వేలాది ఎకరాల్లో వివిధ రకాల పంటలు పూర్తిగా నీట మునిగి దెబ్బతిన్నాయి. వాగులు, వంకలు, పొంగి ప్రవహించి పంట పొలాలన్నీ నీటి మయమయ్యాయి. నీటి ప్రవాహానికి కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు వందల కిలోమీటర్ల మేరకు వర్షం తాకిడికి దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం జరగనప్పటికీ కొంతమేర ఆస్తినష్టం సంభవించింది. శివారు ప్రాంత కాలనీలు ఇప్పుడిప్పుడే నీటి నుంచి తేరుకుంటున్నాయి. మత్స్యకారులైతే గత 15 రోజుల నుంచి వేటలేక అల్లాడుతున్నారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో మరో అల్పపీడన ద్రోణి ఏర్పడిందని దీని ప్రభావంతో ప్రకాశం జిల్లాలో కూడా ఓ మోస్తరు నుంచి భారీగా వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. దీని ప్రభావంతో జిల్లాలో బుధవారం ఒంగోలుతో పాటు పలు చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. మొంథా తుఫాను ప్రభావంతో అల్లాడిన రైతాంగం అల్పపీడన ప్రభావం వలన మరలా జిల్లాకు భారీ వర్షపాతం నమోదైతే ఈ ఏడాది ఖరీఫ్ సాగు కూడా ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం లేకపోలేదు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో అరటి, బొప్పాయి పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. ఇప్పుడిప్పుడే తుఫాను నుంచి కోలుకుంటున్న జిల్లాపై మరో వాయుగుండం గండం ఉందన్న వార్తలను జనం తట్టుకోలేకపోతున్నారు. వాతావరణశాఖ నుంచి దీనిపై ఇప్పటివరకు స్పష్టమైన ఆదేశాలు జిల్లాకు అందలేదు. వాయుగుండం అయితే ఏర్పడటంతో దీని ప్రభావం జిల్లాపై ఉండవచ్చనే పరిస్థితులు కన్పిస్తున్నాయి. చలిగాలులతో కూడిన ఈదురు గాలులు వీయడం, అక్కడక్కడ జల్లులు పడటంతో మరో ప్రమాదం పొంచివుందన్న భయాందోళనలో జనం ముఖ్యంగా రైతాంగం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



జిల్లా రిజిస్టర్ కార్యాలయంపై
ఏసీబీ దాడులు

- ముందస్తుగా జాగ్రత్త పడ్డ కార్యాలయ సిబ్బంది
- కిటికీలో నుండి రూ.30 వేలు బయటికి విసిరేసిన వైనం
- మరికొంత నగదును పట్టుకున్నట్లు స్పష్టం చేసిన అధికారులు

విశాలాంధ్ర- ఒంగోలు : జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంపై బుధవారం ఏసీబీ దాడులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో అన్ని రిజిస్టర్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు నిర్వహించింది. అందులో భాగంగా రిజిస్టర్ కార్యాలయంపై కూడా దాడులు నిర్వహించినట్లు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు. అయితే తమను గమనించిన కొందరు వ్యక్తులు కార్యాలయం కిటికీలో నుండి రూ.30వేలు నగదును బయటకు పడవేశారని, మరో రూ.10వేలు కార్యాలయ బాత్ రూంలో పడవేశారని, వాటితో పాటుగా పలు రికార్డ్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మరికొందరు ప్రైవేటు వ్యక్తుల నుండి కూడా నగదు స్వాధీనం చేసుకున్నట్లు వ్యవహరించారు. పూర్తి వివరాలను త్వరలో తెలియజేస్తామని, దాడులు కొనసాగుతాయని ఈ సందర్భంగా రమేష్ వివరించారు.

సుందరంగా బీచ్‌గా సూర్యలంక

కలెక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : దేశంలోనే సూర్యలంక బీచ్ ఒక మంచి పర్యాటక బీచ్‌గా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. సూర్యలంక బీచ్ పరిసర ప్రాంతాలను బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన మొంథా తుఫాన్ కారణంగా సూర్యలంక బీచ్‌లో గుంటలు పడి, లోతు ఎక్కువగా ఉన్నందున పర్యాటకులను బీచ్ సందర్శనకు నిషేధించినందున, కార్తీక మాసం సందర్భంగా ప్రజల సముద్ర స్నానాల నిమిత్తం బీచ్ సందర్శనకు అనుమతి, ప్రస్తుత పరిస్థితులపై ఆయన అధికారులను ఆరా తీశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మారినందున, ఇవే పరిస్థితుల కొనసాగితే రెండు రోజుల్లో బీచ్‌లో ఏర్పడిన గుంతలు పూడిపోయి యదాస్థితికి వస్తుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సూర్యలంక బీచ్‌ను సర్వాంగ సుందరంగా ఉంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సూర్య లంక బీచ్‌లో ఒక సమగ్ర నిర్మాణం జరగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియా, బాపట్ల టౌన్ డిఎస్పి రామాంజనేయులు, బాపట్ల తహసిల్దార్ సలీమా పాల్గొన్నారు.

జనసంద్రంగా భైరవకోన

విశాలాంధ్ర-సిఎస్ పురం : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోన బుధవారం కార్తీక పౌర్ణమి కావడంతో వేలాది మంది భక్తులు పర్యాటకులతో భైరవకోన జన సంద్రం లాగా నిండిపోయింది. వేలాది మంది భక్తులతో శివనామ స్మరణతో భైరవకోన మారుమోగిపోయింది పవిత్రమైన కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారుజామున నుంచే వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు మహిళలు పెద్ద ఎత్తున భైరవకోన ఆలయానికి చేరుకున్నారు భైరవకోన భక్తులతో కిటకిటలాడింది భైరవకోనని జలపాతం వద్ద మధ్య భక్తుల కేరింతలు, 'హర హర మహాదేవా', 'ఓం నమః శివాయ' నినాదాలతో భైరవకోన మార్మోగిపోయింది. జలపాత స్నానానంతరం భక్తులు దుర్గభర్గులేశ్వరస్వామి, శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని, శివలింగాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు, నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా భైరవకోనలో ప్రత్యేకంగా అఘోరాలు ప్రత్యేక శివలింగానికి రుద్రాభిషేకం

మిగతా 2 లో ...

సముద్ర తీరంలో...జాగ్రత్తలు పాటించాలి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కార్తీక పౌర్ణమి సందర్భంగా కొత్తపట్నం సముద్ర తీరంలో ప్రజలు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అధికారులు చేసిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. సముద్రస్నానాలకు వచ్చిన ప్రజలతోనూ ఆయన మాట్లాడారు. సంప్రదాయబద్ధంగా పుణ్యస్నానాలు ఆచరించాలని వారికి సూచించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.

చెత్త తొలగించారు..

విశాలాంధ్ర-కంభం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడ మైదానంలో చెత్తంతా పేరుకు పోయింది. క్రీడామైదానంకు వచ్చే పాదచారులకు చెత్త దుర్వాసన వస్తుంది. ఈ నెల మూడవ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన 'అమ్ముకున్నారు ..వెళ్లిపోయారు' చెత్త మిగిల్చిన టపాసుల వ్యాపారస్తులు..శీర్షికకు కందులా పురం గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ బేగ్ స్పందించి మంగళవారం సాయంత్రం తమ గ్రామ పంచాయతీ సిబ్బందితో చెత్తంతా తొలగించి శుభ్రం చేసారు.

శ్రీ సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి పట్టణంలోని పామూరు రోడ్డులో డాక్టర్ పెరుగు మురళి కృష్ణ నూతనంగా నిర్మించిన శ్రీ సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కనిగిరి పట్టణంలో అధునాతన సౌకర్యాలతో మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి వైద్యశాల దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత మురళి కృష్ణ కదిరి బాబురావుని శాలువాతో సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మాజీ పిడిసిసి బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వై సరితారెడ్డి, ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు, వైసీపి నాయకులు షేక్ ఫయాజ్, కౌన్సిలర్ తమ్మనేని సుజాత, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రసూల్, పి అరుణోదర్, మితికాల గురవయ్య, కదిరి రమణయ్య, సంగు సుబ్బారెడ్డి, బొట్టు శ్రీను, చిల్లా సాయి, కృష్ణ, మార్తాల రాము, ముత్యాల ప్రతాప్ పాల్గొన్నారు.

రాఘవరావు బాధ్యతల స్వీకరణ



విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండల ఉప మండల అభివృద్ధి అధికారిగా జి.రాఘవరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గిద్దలూరు మండలం కిష్టం శెట్టిపల్లి పంచాయతీలో గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై తర్లుపాడు మండలానికి ఉప మండల అభివృద్ధి అధికారిగా వచ్చినట్లు తెలిపారు.

పూసలపాడులో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని పూసలపాడు, ఒందుట్ల గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ రబీ 2025 సీజన్ లో పప్పు సెనగ విత్తనాలు రాయితీపై అందజేయడం జరిగిందని, ఇంకా ఎవరికైనా రైతులకు అవసరం ఉన్నట్లయితే వారికి సంబంధించిన రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి విత్తనాలు పొందాలని తెలిపారు. ప్రస్తుతం వరిలో ఆకు చుట్టు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, నివారణకు కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ ఒక ఎకరాకు 400 గ్రాములు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎన్ ఆది గణేష్, రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను పరిశీలించిన కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : కలెక్టరేట్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణమంతా ఆయన పర్యటించారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రతి విద్యుత్ స్తంభానికి ఒక విద్యుత్ దీపం ఏర్పాటు చేయాలని మునిసిపల్ డిఈని కలెక్టర్ ఆదేశించారు. డిఎంఎఫ్ నిధులతో చేపట్టిన కలెక్టర్ కార్యాలయ భవనం మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. వర్షా కాలంలో భవనం ఉరిస్తున్నందున స్లాబ్‌కి పైభాగంలో కాంక్రీట్‌తో ప్లాస్టింగ్ చేయాలని సూచించారు. దస్త్రాలను నిల్వ చేయడానికి ప్రత్యేక గది లేకపోవడంతో ఎదు ర్కొంటున్న ఇబ్బందులను కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు కలెక్టరు దృష్టికి తెచ్చారు. భవనంపై భాగంలో రికార్డుల రూము నిర్మించాలని ఆర్ అండ్ బి డిఈ, కలెక్టరేట్ ఏవోలకు తెలిపారు. కార్యాలయం భవనానికి అన్ని వైపులా విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. అలాగే కలెక్టర్ కార్యాలయం ఆవరణలో రాత్రివేళ చీకటి లేకుండా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మిగిలిపోయిన రహదారి నిర్మాణం, మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. చేపడుతున్న పనులను ప్రణాళికబద్ధంగా ప్రజా ప్రయోజనం దృష్టిలో ఉంచుకొని పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి వచ్చేముందు వైపు ఫ్లైఓవర్‌కు ఇరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, మున్సిపల్ డి ఈ, ఆర్ అండ్ బి ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

రైతులను ఆదుకోండి

- కలెక్టర్‌ను కలిసిన దర్శి టీడీపీ ఇంఛార్జ్ లక్ష్మి
- తుపాను వల్ల దెబ్బతిన్న రోడ్లు, కాలువలు
- పంట నష్టాన్ని అంచనా వేయాలని వినతి

విశాలాంధ్ర - ఒంగోలు : ఇటీవలి తుఫాన్ బీభత్సంతో ధ్వంసమైన రోడ్లు, కాలువలను పునర్ నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును కోరారు. బుధవారం ఒంగోలులో క్యాంపు కార్యాలయంలో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, టీడీపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ జిల్లా కలెక్టర్ రాజాబాబుని మర్యాదపూర్వకంగా కలుసుకొని తుఫాన్ బీభత్సంతో నియోజకవర్గంలో ఆస్తి నష్టం, పంట నష్టాలపై నివేదిక అందజేశారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఎన్ఎస్పి, ఆర్డబ్ల్యుఎస్ మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, గ్రామాల వారీగా దెబ్బతిన్న రోడ్లు మరియు కాలువల తో కూడిన అంచనాలతో నివేదికను అందజేశారు. అదేవిధంగా తుఫాను బీభత్సానికి ముఖ్యంగా దర్శి ప్రాంతంలో మిర్చి, పొగాకు, పండ్లతోటలు దెబ్బతిన్నాయని డాక్టర్ లక్ష్మీ వివరించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి ప్రభుత్వానికి నివేదిస్తానని, తక్షణ అవసరాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు లక్ష్మీ వివరించారు. అత్యవసరం కింద దర్శి వాటర్ ఫిల్టర్ బెడ్లను మరమ్మత్తులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ప్రకాశం జిల్లాలో మా దర్శి ప్రాంతంలో తుఫాన్ విపత్తును అధికార యంత్రాంగం మీ ఆదేశానుసారం సమిష్టిగా పనిచేసే ఎలాంటి ప్రాణ నష్టం సంభవించకుండా ఎదుర్కోగలిగారని డాక్టర్ లక్ష్మి ప్రశంసించారు. ఎంత పెద్ద తుఫాన్ అయినప్పటికీ అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తూ నిరంతరం చేసిన కృషి ఫలితం ఎంతో మేలు చేసిందని ఆమె కలెక్టర్‌తో మాట్లాడుతూ అన్నారు. దర్శి ప్రాంతంలో కూడా రెవిన్యూ, మున్సిపల్, ఆర్ అండ్ బి, వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్ మండల సిబ్బంది, పోలీస్ సిబ్బంది సమిష్టిగా 48 గంటలకు కంటిమీద కునుకు లేకుండా పనిచేసినందుకు కలెక్టర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో తాళ్లూరు మండల టీడీపి నాయకులు ఓబుల్ రెడ్డి, రమేష్ బాబు, విద్య సాగర్ ఉన్నారు.

యోగి వేమన రెడ్ల సేవాసమితి అన్నదానం

విశాలాంధ్ర -చీమకుర్తి: కార్తీక పౌర్ణమి వనభోజనాల సందర్భంగా రామతీర్థంలో యోగివేమన రెడ్ల సేవాసమితి ప్రాంగణంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులందరికీ భోజనాలు ఏర్పాటు చేయడమైనది. కీర్తిశేషులు ఇలవల బల రామిరెడ్డి కమలమ్మ జ్ఞాపకార్థం కుమారుడు విజయ మోహన్ రెడ్డి ఆర్థిక సహకారంతో 6000 మందికి భోజనాలు సమకూర్చటమైనదని సంస్థ అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి ఉపాధ్యక్షుడు ఇలగాల విజయ మోహన్ రెడ్డి, కార్యదర్శి గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, గౌరవ సలహాదారు అంబటి వీరారెడ్డి,జాయింట్ సెక్రటరీ సంఘన భక్తి రెడ్డి,ఓగూరి రామకృష్ణారెడ్డి,గంగిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు తెలిపారు.

పంట నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర- కురిచేడు : మండలంలోని కల్లూరు మరియు ఆవులమంద గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలో సాగు చేసినటువంటి వరి మరియు మిరప పంటలను పరిశీలించడం జరిగింది. వరి పంటలో ప్రస్తుతం అగ్గి తెగులు మరియు పాము పొడ తెగులును గమనించి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పాము పొడ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. మిరప పంటలో కాయ కుళ్ళు తెగులును ఉన్నదని దీని నివారణకు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం రైతు తోటి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు పుష్పించే దశలో ఉందని ఈ సమయంలో మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు.

జనసంద్రంగా భైరవకోన

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఆలయ ఆవరణ అంతా కార్తీక దీపాల కాంతులతో ప్రకాశించి భక్తిశ్రద్ధలతో కళకళలాడింది. కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు దీపారాధనలు చేసి, ఆలయ ప్రాంగణమంతా భక్తిశ్రద్ధలతో వెలిగించిన కార్తీక దీపాలతో నిండిపోయి ఆధ్యాత్మిక కాంతులతో మెరిసిపోయింది భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. జలపాతం వద్ద ప్రత్యేక భద్రతా సిబ్బంది ని నియమించి భైరవకోన జలపాతం దగ్గరకు ఎవరిని అనుమతించలేదు పక్కనే ఉన్న నీటి కొలనులో మహిళలు చిన్నారులు పెద్ద ఎత్తున స్నానాల ఆచరించారు కార్తీక పౌర్ణమి సందర్భంగా వివిధ సంఘాల వారు ఉచిత అన్నదానం కేంద్రాలు ఏర్పాటు చేసి వేలాది మందికి అన్నదానం నిర్వహించారు భైరవకోనను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా భైరవకోన ఈవో వంశీకృష్ణారెడ్డి భైరవకోన చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్

రాజు ప్రత్యేకఏర్పాటు చేశారు వాహనాలను కొండపైకి అనుమతించకుండా పోలీసులు కొండ కిందే ఆపివేయడంతో ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు అఘోరాలు నిర్వహించిన రుద్రాభిషేకం చూడటానికి పెద్ద ఎత్తున భక్తులు ఇచ్చేశారు భక్తులకు ట్రాఫిక్కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా పామూరు కొండేపి సీఐలు మాకినేని శ్రీనివాసరావు జి సోమశేఖర్ ఎస్సైలు ఏం వెంకటేశ్వర్ నాయక్ కృష్ణ పావని పి కిషోర్ బాబు మాధవరావు బందోబస్తు నిర్వహించారు.

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : కార్తీక పౌర్ణమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచే పలు శివాలయాలలో మహిళలు 365 వత్తులతో ఉసిరి దీపాలను వెలిగించారు. పలు శివాలయాలలో ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. మండలంలోని పులిపాడులో శ్రీ గంగా పార్వతీ సమేత పూర్ణేశ్వర స్వామి, పసుపు గల్లులో కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవి, ముండ్ల మూరులో శ్రీ మల్లమాంబ సమేత మల్లికార్జున స్వామి, పెద్ద ఉల్లగల్లులో గంగా పార్వతి అన్నపూర్ణ దేవి మారెళ్ళలో చెన్న మల్లేశ్వర స్వామి, ఈదరలో రాజరాజ మల్లేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేసి సాయంత్రం దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

వదంతులు ప్రచారం చేస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర-చీమకుర్తి : శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రత రక్షణ పై భరోసా కల్పించడం లక్ష్యంగా బండ్లమూడి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు. గ్రామంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని, ప్రజలు తమ పనుల్లో నిమగ్నమై ఉన్నారని,ఇటీవల వ్యక్తిగత గొడవలు నేపథ్యంలో గ్రామంలో శాంతిభద్రతలు పటిష్టం చేయడం కోసం ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చీమకుర్తి సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు పికెట్స్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ సిబ్బంది కవాతు నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధులు బస్టాండ్ కాలనీలో పోలీసులు కవాతు నిర్వహించి ప్రజల్లో నమ్మకం భద్రత భావం కల్పించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలు నిగాక కలగకుండా ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పేలా ఈ ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.అంతేకాకుండా డ్రోన్ కెమెరాలతో ఆకాశమార్గాన నిరంతర కాపలా కాస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్పి. వి.వి.రమణ కుమార్ చీమకుర్తి సి.ఐ.దాసరి ప్రసాద్ మరియు పోలీస్ అధికారులు గ్రామ ప్రజలతో మాట్లాడి ఎటువంటి వదంతులు నమ్మవద్దని సామాజిక మాధ్యమాలలో ప్రచారం అయ్యే తప్పుడు సమాచారం నమ్మకూడదని సూచించారు. ప్రజల్లో శాంతి, శాంతియుత వాతావరణం అందరూ సహకరించాలని కోరారు. విచారణలో ఉన్నాయని ఈ సంఘటన రెండు కులాల మధ్య వివాదం కాదని వ్యక్తుల మధ్య జరిగిన గొడవ మాత్రమేనని పోలీసులు తెలిపారు. తప్పుదారి పట్టించే వార్తలు లేదా కుల వివాదాలు రేకెత్తించే పోస్టులు సామాజిక మాధ్యమంలో ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంది పంటపై రైతులకు సూచనలు

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలం వెంకటాచలం పల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో సాగు చేసిన కంది, వరి పంట లను పరిశీలించి, కంది పూమొగ్గ దశలో క్లోరి పైరిఫోస్ మరియు వేప నూనె పిచికారీ చేయవలెనని, తద్వారా పురుగుల గ్రుడ్లను నాశనం చేయవచ్చని, పురుగుల ఉధృతి పంటల పై తగ్గటమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుందని. వరి కంకి దశలో సాయంత్రం లేదా ఉదయం వేళలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి హెచ్ ఎ కోటి నాయక్, ఎంపీ ఈ ఓ అనూష మరియు రైతులు పాల్గొన్నారు.

రైతులందరూ గుర్తింపు సంఖ్య పొందాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పిఎం కిసాన్ పథకం కొరకు రైతులందరూ తప్పకుండా రైతు గుర్తింపు సంఖ్య పొందాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కే బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని కెల్లంపల్లి, పసుపుగల్లు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకం కొరకు రైతులందరూ తప్పకుండా రైతు గుర్తింపు సంఖ్య పొందాలన్నారు. ఇందుకోసం మీ గ్రామాల్లో ఉన్న రైతు సేవ కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కొరకు పొలమును ఆధార్ నంబర్కు లింకు చేసుకొని, బ్యాంకు ఖాతాకు లింకు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు, ఉద్యానవన శాఖ సహాయకులు సువర్చల, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయనిర్మల పాల్గొన్నారు.

కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర-పీసీపల్లి : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలో శైవ క్షేత్రాలు కార్తీకశోభ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుండే శివునికి రుద్రాభిషేకాలు, పాలాభిషేకాలు అమ్మవార్లకు పసుపు కుంకుమ పూజలు ప్రత్యేక అలంకరణలు అర్చకులు చేపట్టారు. మండలంలోని వెంగళాపురం సమీపంలోని శ్రీ గంగా పార్వతీ సమేత పంచలింగాలకొండ శివాలయంలో అర్చకులు గట్టుపల్లి రామకృష్ణ శర్మ, పెద అలవలపాడు ఉమా సోమేశ్వర స్వామి దేవస్థానంలో మారెళ్ళ రామకృష్ణ, పెద్ద ఇర్లపాడుదుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాలలో భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆయా గ్రామాల్లోని మహిళలు వేకువజామునే లేచి తల స్నానం చేసి అనంతరం శివాలయాలకు వెళ్లి ఆలయాలలో నువ్వుల నూనెలతో దీపారాధన చేసి, దేవస్థానంలో శివుని దర్శనం చేసుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు దీక్షలతో ఉపవాసం ఉండి రాత్రికి దైవదర్శనంతో ఉపవాసాన్ని ముగించారు. పలుచోట్ల భక్తులకు అల్పాహారం నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

రబీ సీజన్‌కు..'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - తర్లుపాడు : తర్లుపాడు మండలంలో రబీ సీజన్‌కి పొలం పిలుస్తోంది కార్యక్రమం మొదలైందని తర్లుపాడు మండల వ్యవసాయ అధికారి పి జోస్నాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం లోని సీతనాగులవరం, సూరేపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారని తెలిపారు. రైతులకు అవసరమైన పప్పుశనగను 25 శాతం రాయితీతో జేజి 11 విత్తనాలు శుక్రవారం నుంచి పంపిణీ చేస్తారని తెలియజేశారు. రైతులకు కావలిసిన యూరియా 20-20-0-13 ఎరువులు రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.అనంతరం రైతులతో కలిసి కంది పొలాలను సందర్శించారన్నారు.కంది పంట కళ్ళెదశలో తప్పనిసరిగా వేపనూనెను పిచికారి చేయాలని తెలిపారు. వేపనూనె స్ప్రే చేయుట వలన పురుగులు ఆకులపై గుడ్లు పెట్టవని, తద్వారా పురుగుల సంతతి తగ్గిపోతుందని అన్నారు. పురుగు మందులతో పాటు వేప నూనెను కలుపుకొని పంటలపై పిచికారి చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్, వీఏఏ జిలానీ, రైతులు పాల్గొన్నట్లు తెలిపారు.

నల్లబర్లి పొగాకు సాగు చేయొద్దు

విశాలాంధ్ర- వెలిగండ్ల: నల్ల బర్లి పొగాకు రైతులు ఎవరో సాగు చేయవద్దని వ్యవసాయ అధికారిని తమ్మినేని శిల్ప కోరారు. బుధవారం మండలంలోని రామ గోపాలపురం, ఇమ్మడిచెరువు గ్రామాలలో వ్యవసాయ శాఖ పొలం పిలుస్తుంది నిర్వహించడం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ నందు వేసిన పంటలకు నవంబర్ 8 వ తేదీ వరకు ఈ పంట ను పొడిగించారని మినుము, పంటను, పొగాకు నారులను పరిశీలించి రైతులకు తగు సూచనలు,సలహాలు అందించారు. నల్ల బార్లీ పొగాకు ఏ ఒక్క రైతు కూడా సాగు చేయరాదు అని తెలియచేయటం జరిగినది. వి.ఏ ఏ లత శ్రీ, యాస్మిన్, ఏ హెచ్ ఏ జాస్మిన్, యాసిన్ పాల్గొన్నారు.

ఆలయాలను పర్యవేక్షించిన తహసీల్దార్ సురేష్

విశాలాంధ్ర-కొనకనమిట్ల : కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు ఉండే గ్రామాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల దేవస్థానాలు పరిధిలో ఉండే లవిఆర్ఓ అక్కడే ఉండాలని సూచించారు. అందులో భాగంగా బుధవారం వెలుగొండ లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఎదురు రాళ్లపాడు లోని సంగమేశ్వర స్వామి ఆలయం ,గార్లదిన్నెలోని శివాలయ లను సందర్శించి తాసిల్దార్ ప్రత్యేక పూజలు చేశారు సందర్భంగా పూజారులు తహసీల్దార్‌కి అభిషేకాలు ఇచ్చారు.

కొండపై రోడ్డు ఏర్పాటు... సులభమైన రాకపోకలు

విశాలాంధ్ర -కంభం : అర్ధవీడు మండలంలోని వెలగలపాయ లోయ ప్రాంతంలో ఉన్న 13 గ్రామాలకు రోడ్ సదుపాయం సరిగా లేక పోవటంతో గత పదిహేను రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు కాకర్లనుండి మూడు కిలోమీటర్లమేర రోడ్ పై నీరునిలచి రాక పోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రజలు వారి పొలాలకు అవసరమైన ఎరువులు, ఇంటికి నిత్య అవసర సరుకులకు పలు ఇబ్బింగులకు గురిఅయినట్లు ఆయా గ్రామస్తులు పేర్కొన్నారు. దీనికి తోడు గత పదిహేను రోజులనుండి సెల్ టవర్ పనిచేయక గ్రామాలూ మూగబోయినాయి. ఎవరైనా అనారోగ్య సమస్యలకు గురైతే అత్యవసర సమయంలో రోగుల బారినపడిని వారు వైద్య కోసం నా నా అవస్థలు పద్దామని వాపోయారు. కాకర్ల ,మాగుటూరు ,బసిరెడ్డిపల్లి ,యాచవరం, రంగాపురం, బొమ్మిలింగం ,వెలగలపాయ గ్రామప్రజలు తరపున మాజీ ఎమ్మెల్యే కుదురు నాగార్జున రెడ్డి రెడ్డి జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు కాకర్ల కొండవెంట రోడ్ మార్గంను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసారు. బుధవారం నుంచి ఆయా గ్రామాల ప్రజలు కంభంకు వచ్చి నిత్య అవసర సరకులు తీసుకు వెలుతున్నారు.

తూములకు మరమ్మతులు

విశాలాంధ్ర -కంభం : మొంథా తుఫాన్ వల్ల కంభం చెరువు నిండి అలుగు పారింది. దీంతో రైల్ వే బ్రిడ్జి సమీపంలో ఉన్న మరో పెద్ద అలుగుకు నీళ్లు పొర్లి పోవటంతో పంట పొలాలకు వెళ్లే రహదారి తెగింది. రైతులకు వారి పంటపొలాలకు వెళ్లేందుకు దారిలేక నానా అవస్థలు పడ్డారు. సోమవారం రైతులు ఇరిగేషన్ కార్యాలయానికి వెళ్లి తూములు మరమత్తులు చేయాలనీ వాదనకు దిగారు. స్పందించిన ఏఇ శ్రీను నాయక్ వరద ఉధృతి తగ్గటంతో బుధవారం కొండ మట్టి తెప్పించి పంట కాల్వలకు రోడ్ మార్గం ఏర్పాటు చేసారు .రైతులకు వారి పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేయటం జరిగిందని ఏఇ శ్రీను నాయక్ తెలిపారు. అక్కడవున్న మూడు తూములకు మరమత్తులు చేపట్టారు .తూములకు మరమ్మతులు చేయటం వల్ల ప్రధాన పంట కాల్వలకు నీరును మళ్లించవచ్చని ఏఇ తెలిపారు.

జ్వాల తోరణం వెలిగించేందుకు ఉత్సాహం

విశాలాంధ్ర-త్రిపురాంతకం : కార్తీక మాసం పురస్కరించుకొని కార్తీక పౌర్ణమి రోజున శివనామ స్మరణతో శివాలయ ప్రాంగణం మారుమ్రోగింది. తెల్లవారు జాము నుండి భక్తులు సాగర్ ప్రధాన కాల్వ వద్ద స్నానము ఆచరించి శివాలయం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రాంగణంలోకి ప్రవేశించిన భక్తి హర హర మహాదేవ, ఓం నమశ్శివాయ అంటూ శివనామ స్మరణ చేశారు. ఆలయ అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. ఉదయం నుండే భక్తులు క్యూ లైన్లో, మెట్ల వద్ద బారులు తీరారు. ఆలయం ప్రాంగణంలో ఉన్న ఉసిరి చెట్టు, ఆలయం చుట్టుదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో అనిల్ వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా బారుకెట్లు నిర్మించి దర్శనానికి అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కృష్ణ మోహన్, ఎంపిడిఓ రాజ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ అస్సాన్ పర్యవేక్షణలో కార్తీక పౌర్ణమి చూడచక్కగా జరిగింది. వైద్యశాల సిబ్బంది శివాలయం, అమ్మవారి ఆలయాల వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చర్యలు చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలకు వారి వారి సామాజిక అన్నదాన సత్రంలో సత్రాల నిర్వాహకులు ఉచిత భోజన సదుపాయం కల్పించారు. భక్తులకు అల్పాహారం, పానీయాలను పంపిణీ చేశారు. సాయంత్రం జ్వాల తోరణం వెలిగించేందుకు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

365 ఒత్తులతో దీపాలు

విశాలాంధ్ర-పుల్లలచెరువు : కార్తీక మాస పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు శివనామ స్మరణతో బుధవారం మారుమోగిపోయాయి. మండలం లోని పుల్లల చెరువులోని భవానీ శంకర ఆలయం, చాపలమడుగులోని ఉమా మహేశ్వర ఆలయం, శతకొడులోని సప్తకొటేశ్వరాలయాలు హరహర మహాదేవ, శంభోశంకర నినాదాలతో ఆలయాలు మారు మోగిపోయాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా మహిళలు, పురుషులు ప్రాథ: కాలం నుండి శివపార్వతులను దర్శించి భక్తితో పూజలు నిర్వహించారు. శివపార్వతులకు భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపవాస దీక్షతో 365 ఒత్తులతో దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. ఉత్సవ మూర్తుల ఊరేగింపు కన్నుల పండువలా జరిగింది.

సెషన్స్ జడ్జిస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా జి.శ్రీకాంత్

విశాలాంధ్ర - విశాలాంధ్ర : ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జిస్ కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులైన జి.శ్రీకాంత్ బుధవారం ప్రకాశం భవనములో కలెక్టర్ పి.రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వం తరపున సివిల్ కేసులకు ఆయన కోర్టులో ప్రాతినిధ్యం వహిస్తారు. ఆయన మూడేళ్ల పాటు లేదా సర్వీస్ నుంచి ప్రభుత్వం తొలగించే వరకు (ఏది ముందుగా జరిగినా) ప్రభుత్వ న్యాయవాదిగా కొనసాగుతారు.

సచివాలయంను తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీఓ

విశాలాంధ్ర-పెద్దారవీడు : బద్వీడు చర్లోపల్లి గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ శానిటేషన్, ఎస్ డబ్ల్యు పిసి షెడ్డుని, క్లాప్ మిత్ర జీతాలు, మైకు బండ్లకి పెట్టి అవగాహన చెత్త విషయంలో జరుగుతున్నదా లేదా మరియు హాజరు ముఖ్యంగా ప్రతి ఒక్క ఉద్యోగి ప్రతిరోజు ఒక టాస్క్ ఫిక్స్ చేసుకొని కలెక్టర్,డిపిఓ వాళ్ల ఆదేశించిన ప్రకారం ఇంటి పన్ను వసూలు కార్యక్రమం చాలా ముఖ్యమైనదిగా భావించి వెంటనే ప్రతిరోజు ప్రతి ఒక్కరు 20 ఇళ్లకు తగ్గకుండా పన్నులు వసూలు చేయాలని జీవిఎస్డబ్ల్యూఎస్ సిబ్బందిని యావత్తు పంచాయతీ అభివృద్ధి అధికారి అయిన డిడిఓ వినియోగించుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు ఇంటి పన్నుపై తాను పంచాయతీ కార్యదర్శులతో సాయంత్రం లేదా ఉదయం రివ్యూ చేస్తానన్నారు. గ్రామపంచాయతీ సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. త్వరలో పూర్తిస్థాయి సమయం ప్రతి పంచాయతీకి కేటాయించి ముందుగా నోటీసు ద్వారా తెలిపి అందరి సిబ్బందితో కూడా వారి వారి విధులు చర్చించి రికార్డు, తనిఖీ చేస్తానని, సమాచార హక్కు చట్టం బోర్డు తప్పక సచివాలయంలో ఉండాలని ఆదేశించారు.

కార్తీక దీపాలతో ఆలయాలు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : శివుడికి అత్యంత ప్రీతిమాసమైన కార్తీక మాసంలో, బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు మండలంలోని పలు ఆలయాలలో తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీకదీపం వెలిగించారు. మండల కేంద్రమైన దోర్నాలలోని చెన్న మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజారి పంచాంగుల మణిశర్మ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని రంగ రంగ వైభవంగా, వేద మంత్రాల మధ్య, కోటి దీపోత్సవ కార్యక్రమం మరియు కార్తీకదీపం, అభిషేకాలు, పూజలు, సాయం సంధ్య వేళలో జ్వాలా తోరణం రంగ రంగ వైభవంగా నిర్వహించారు. అలాగే మండలంలోని మోట్ల మల్లికార్జునపురం వద్ద ఆలయ పూజారి అశ్విని కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అలాగే సాయిబాబా దేవాలయంలో, ఎడవల్లి దగ్గర తిరుమలనాథ స్వామి ఆలయంలో, అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే పలు శివాలయాలలో మహిళలు 365 వత్తులతో ఉసిరి దీపాలను వెలిగించారు. పెద్ద సంఖ్యలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షలు చేసి సాయంత్రం, స్వామివారికి కాయ కర్పూరం సమర్పించి, దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సంఘమేశ్వర ఆలయంలో కార్తీక శోభ

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని చెన్ను పాడు గ్రామం నందు సంగమేశ్వర స్వామి దేవాలయము నందు కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు బుధవారం అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి శివాలయంలో తెల్లవారుజాము నుంచి మహిళా భక్తులు పాల్గొని పాలేటి గంగలో స్నానం ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 365 వత్తులతో కార్తీక దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. శివనామ స్మరణతో భజనలు నిర్వహించారు. భక్తులకి ఇబ్బంది కరం లేకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసు సిబ్బంది రెవెన్యూ సిబ్బంది సచివాలయం సిబ్బంది సన్నిధానంలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు.

బసినేపల్లి పంచాయతీలో బీజేపీ నాయకుల పర్యటన

విశాలాంధ్ర - బేస్తవారిపేట : మండలంలోని బసినేపల్లి గ్రామ పంచాయతీలోని గంటాపురం, చెరుకుపల్లి, జెన్నివారిపల్లి గ్రామాలలో భారతీయ జనతా పార్టీ నాయకులు బుధవారం పర్యటించారు. "ప్రవాస యోజన ఆత్మ నిర్భర భారత్ సంకల్ప అభియాన్" కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం కరపత్రాలు, డోర్ స్టిక్కర్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడహాక్ కమిటీ ద్వారా భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్ గా గంటాపురం గ్రామానికి చెందిన కూతుర్ల చలమారెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో ప్రవాస యోజన ఆత్మ నిర్భర భారత్ సంకల్ప అభియాన్ ఇన్చార్జి మొర్రిబోయిన చెన్నయ్య, జిల్లా కిసాన్ మోర్చా వైస్ ప్రెసిడెంట్ చేగిరెడ్డి రామకృష్ణారెడ్డి, నాయకులు మద్దుల అనంతరామిరెడ్డి, చిత్తలూరి రామయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పలు గ్రామాలలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు బుధవారం అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. మండలంలోని సలనూతల, బ్రాహ్మణపల్లి, గొట్లగట్టు చిన్నారి కట్ల, పెదారికట్ల కొనకనమిట్ల ,రేగడపల్లి అంబాపురం, గ్రామాలలోని శివాలయాలలో తెల్లవారు జాము నుంచి మహిళా భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపాలు వెలిగించి భక్తిని చాటుకున్నారు. శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి.

భైరవకోనలో దద్దాల నారాయణ యాదవ్

విశాలాంధ్ర-సిఎస్ పురం : కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని సీయస్ పురం మండలంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనను బుధవారం కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ సందర్శించారు. ముందుగా జలపాతంను సందర్శించి, శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు, భర్గేశ్వర స్వామి, నాగేశ్వర స్వామి, కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివలింగాలను దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణతో ఆశీర్వదించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ త్రిముఖ దుర్గాదేవి, భైరవేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గం లోని ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆకాంక్షించారు.. అనంతరం రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దద్దాల నారాయణ యాదవ్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మరియు పార్టీ నాయకులను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించి, స్వామి వారి ప్రసాదం, శ్రీ భైరవేశ్వర స్వామి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీయస్ పురం మండల పార్టీ అధ్యక్షులు పొలగుల్ల మల్లికార్జున రెడ్డి,సిద్దు వెంకటరెడ్డి, మదతల కస్తూరి రెడ్డి, మితికల గురవయ్య, కల్లూరి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను కలిసిన ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న

విశాలాంధ్ర-చీమకుర్తి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామంలో నవంబర్ 3 తేదీన గొడవలు జరిగిన నేపథ్యంలో గాయపడిన బాధిత కుటుంబాలను ఒంగోలు రెవిన్యూ డివిజనల్ అధికారి కే.లక్ష్మీ ప్రసన్న బండ్లమూడి ఎస్సీ కాలనీలోని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం కంఠం ఏసుదాసుకి చెందిన సరుకుడు చెట్లను డివిజనల్ ఫారెస్ట్ అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్,అగ్రికల్చర్ చీమకుర్తి తాసిల్దార్ డి. బ్రహ్మయ్య తో కలిసి భూమ్మీద పరిశీలించి ఎంత మేరకు నష్టం జరిగిందో అంచనా వేయవలసిందిగా అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ వారిని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పంటలు పరిశీలించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : ఈ క్రాప్‌లో నమోదైన పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ లో నమోదైన పంటను బుధవారం, కంకటపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్వే నెంబర్ 2లో ఈ క్రాప్ 5.9 వర్షన్, ఈ పంట యాప్‌లో అన్వేన్ ద్వారా నమోదు చేసిన మన్నెం నిమ్మికి చెందిన 3 ఎకరాల 19 సెంట్ల పొలంలో వేసిన వరి పైరును ఆయన పరిశీలించారు. మన్నెం నిమ్మికి ఆయన ఫోన్ చేసి పంట వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఉండాలని గ్రామ సర్పంచ్ కి తెలిపారు. గ్రామంలో ఎవరు కూడా ఆరుబయట మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామంలో రెండు డొంకల్లో రోడ్డు ఏర్పాటు చేయాలని సర్పంచ్ జిల్లా కలెక్టర్‌ను కోరగా, గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటే, రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల మండల వ్యవసాయ అధికారి శారద, కంకటపాలెం సర్పంచ్ మద్దిరాల వందనం, వీఆర్‌ఓ సుధారాణి, వి ఏ ఏ షబీనా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత వల్లపు పాపయ్య మృతి

విశాలాంధ్ర - సంతమాగులూరు : చవిటిపాలెం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు వల్లపు పాపయ్య ఆకస్మికంగా గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ సంత మాగులూరు మండల కార్యదర్శి కాలేషాగారి ఖాదర్ బాషా, సహాయ కార్యదర్శి మేకల రమణయ్య, ఏఐటీయూసీ నాయకులు ముస్తఫా, ఏరియా కార్యదర్శి చంద్ర, సీపీఐ సీనియర్ కామ్రేడ్ కాలేషావలి, గ్రామ కార్యదర్శి గుంజి నారాయణతో కలిసి బుధవారం హుటాహుటిన చవిటిపాలెం వెళ్లారు. ఈసందర్భంగా పాపయ్య పార్థివ దేహంపై సీపీఐ జెండా ఉంచి, పూల మాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అనంతవరం,సురవరుపుపల్లెల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - యద్దనపూడి : రైతులు రబీ సాగు లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎస్ వి పి కుమారి అన్నారు. మండలం లోని అనంతవరం, సురవరపుపల్లె, గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రత్తిపంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు .ఈ కార్యక్రమంలో గుదే తారక రామారావు, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్, నిమ్మల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు,ఏ ఈ ఓ మధుప్రియ, వివిఏ సీమ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు చేయాలి

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని గ్రామపంచాయతీల ఇంటి పన్ను వసూలు నూరు శాతం పూర్తి చేయాలని బాపట్ల జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి చెరుకూరి విజయలక్ష్మి ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ సమావేశం హాల్లో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహించరాదనిహెచ్చరించారు. సర్వేలన్నీ సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి. ప్రద్యుమ్న కుమార్, డిప్యూటీ ఎంపీడీవో బి.హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒత్తిడితో అనారోగ్యం

విశాలాంధ్ర - పర్చూరు : జాతీయ ఒత్తిడి అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ పర్చూరు మండలం ఉప్పుటూరు పంచాయి తీ నందు బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి రోజూ పలు రకాల సవాళ్లను ఎదుర్కోవలసి ఉంటుందని, ఈ క్రమంలో కొందరు ఒత్తిళ్లకు గురౌతారని, మనిషికి మానసికంగా శారీరకంగా అనేక రకాల రుగ్మతలు వస్తాయని, తాజా సర్వేల ప్రకారం షుగర్, బీపీ, థైరాయిడ్, ఊబకాయం, గుండె మరియు కిడ్నీల వంటి పలు రకాల ఆరోగ్య సమస్యలు దీర్ఘకాల ఒత్తిడితో వస్తున్నాయని, కావున ఈ ఒత్తిళ్లను ఎదుర్కోవాలంటే కచ్చితంగా ధ్యానం, వ్యాయామం, వాకింగ్ ఎంతగానో అవసరమన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఉప్పుటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలి

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని అన్ని గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీపీ అవిసెన జ్యోతి గ్రామపంచాయతీల సర్పంచులకు కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ అవిసెన జ్యోతి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసినందున గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలకుండా ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అధికారులు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

చేనేత కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయి కుటుంబ పోషణ కష్టమై చేనేత కార్మికుల మగ్గాలలో నీరు చేరి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని సాయి రాజేంద్ర చేనేత సహకార సంఘం అధ్యక్షులు దివి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం చెరుకుపల్లి గ్రామ పరిధిలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన తుఫాను సాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ భూనీల సమేత చెన్నకేశవ స్వామి దేవస్థానం అధ్యక్షులు కందుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తుఫాను బాధితులకు అండగా ఉండి పకడ్బందీగా మందస్తు చర్యలు చేపట్టడంతో ప్రాణ, ఆస్తి నష్టం చాలావరకు తగ్గించగలిగారన్నారు. సహాయక శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందిని ఆదుకున్నారని, ఇది ప్రభుత్వ పెద్దల ముందుచూపుకు నిదర్శనం అన్నారు. వారితో పాటుగా ఎన్నో ఏళ్లుగా చేనేతనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికులకు ఈ తుఫాను తీరని నష్టం మిగిల్చిందన్నారు. ఎంతోమంది కుటుంబ పోషణ కోసం చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని ప్రభుత్వం వీరికి సాయం అందించేందుకు ముందుకు వచ్చి ఒక్కొక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. కార్మికుల జీవితాలు గాడిలో పడే వరకు ఈ జీవన భృతి సరిపోతుందని ప్రభుత్వానికి చేనేత కార్మికుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 107 మంది లబ్ధిదారులకు ఈ తుఫాను సాయాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వోలు నాగరాజు, పుల్లయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు సొంటి సుబ్బారావు, రేషన్ డీలర్లు అసోసియేషన్ అధ్యక్షుడు నాగుల పున్నారావు, విన్న కోటి రామారావు, ఓరుగంటి భావన ఋషి, దివి వెంకటేశ్వరరావు, అందే సాంబశివరావు, రామకృష్ణ, రేషన్ డీలర్లు పూల ప్రసాదు, దేవర్లావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఏల్చూరు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర - సంతమాగులూరు : ఏల్చూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న వృత్తి విద్యా కోర్సులో టెక్నాలజీ, ఆటోమోటివ్ పై విద్యార్థులకు పోటీలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆటోమోటివ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన స్కిల్ కాంపిటీషన్-2025లో విద్యార్థులు ఆకట్టుకునే మోడల్స్, వాహన సేవా డెమోలను ప్రదర్శించారు. ఇంజిన్ పని విధానం, రోడ్ సేఫ్టీ, బ్రేకింగ్ సిస్టమ్స్ వంటి ప్రదర్శనలు అందరి ప్రశంసలు అందుకున్నాయి. ఆటోమోటివ్ వొకేషనల్ ట్రైనర్ వేటూరి నరేంద్ర పర్యవేక్షణలో తొమ్మిదో తరగతి చదువుతున్న వల్లెం భరత్ కుమార్, తొగటి హర్షవర్ధన్, పుచ్చకాయల విష్ణు యాదవ్ బృందం ఆధ్వర్యంలో 'హైడ్రాలిక్ బ్రేకింగ్ సిస్టం' అనే పరికరాన్ని రూపొందించారు. స్కూలు ప్రధానోపాధ్యాయిని కె.మాధవి పుష్పమి, ట్రైనర్ సమక్షంలో పరికరం పనితీరును విద్యార్థులు వివరించారు. ఈ నెల 7న బాపట్లలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఈ ముగ్గురు విద్యార్థులతో పాటు మందా కృపాశేఖర్ ను కూడా పంపనున్నారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - అద్దంకి : కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలకు బుధవారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి పెద్ద ఎత్తున మహిళలు శివాలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి దీపారాధన చేశారు. అద్దంకిలోని వేయి స్తంభాల ఆలయం కమ్మటేశ్వర స్వామి ఆలయం రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. దక్షిణ కాశీగా పిలవబడుతున్న మణికేశ్వరం భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చారు. శివాలయాలలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీల నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

తేనెతుట్టులు తొలగించాలి

విశాలాంధ్ర - రేపల్లె : ప్రతిరోజు తమ పిల్లలను, చిన్నారులను ఆహ్లాదం కోసం సాయంత్రం వేళలో తల్లిదండ్రులు రేపల్లె పట్టణంలోని చంద్రమౌళి మున్సిపల్ చిల్డ్రన్ పార్క్‌కు తీసుకుని వస్తుంటారు.ఆహ్లాదం కోసం పిల్లలను తీసుకువచ్చి జారుడు బల్ల ఉయ్యాలలో ఎక్కించి ఆటలు ఆడిస్తుంటారు. అయితే ఈ పార్కులోనే మంచినీటి వాటర్ ట్యాంక్‌కు తేనె తుట్టెలు పట్టి తేనెటీగలు గుంపులుగా పార్కులో తిరుగుతున్నాయని చిన్నారులు తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటకాయతనంగా పిల్లలు రాళ్లు వేస్తే ఒకసారి తేనెటీగలు మొత్తం పార్క్ అంతా అలుముకుని తమ పిల్లలపై ఎక్కడ దాడి చేస్తాయని వాపోయారు. చిన్నారులకు ఈ పార్కులో తేనెటీగల కారణంగా ప్రమాదం ఉందని మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి తేనె తుట్టెలను తొలగించే చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ

విశాలాంధ్ర - అద్దంకి : మండలంలోని సింగం కొండ దివ్య క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ వేద పండితులు పూజారులు లక్ష తమలపాకుల పూజను అత్యంత వైభవోపేతంగా జరిపించారు. ప్రాతఃకాల సుప్రభాత సేవ బిందె తీర్థం స్వామివారి అలంకరణ అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చుండూరు మురళి సుధాకర్ లక్ష తమలపాకుల పూజలో పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా కార్తీక పౌర్ణమి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె మండలం మోర్తొట గ్రామంలో శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. తాసిల్దార్ శ్రీనివాసరావు, రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు రేపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ మల్లికార్జున రావు దేవస్థానానికి వచ్చుభక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కృష్ణా నదిలోనికి దిగకుండా జల్లి స్నానము ఏర్పాటు చేశారు. దేవస్థానంకు వచ్చే భక్తులకు క్యూలైన్స్, మెడికల్ క్యాంపు వంటి. సదుపాయం పలుకు చేశారు. శానిటేషన్ వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. రెవిన్యూ డివిజనల్ అధికారి ఎన్ రామలక్ష్మి,తహసీల్దార్ ఎం శ్రీనివాసరావు పర్యవేక్షించి భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను టిడిపి నేత అనగాని శివప్రసాద్ అడిగి తెలుసుకున్నారు.

ముక్తేశ్వరం శివనామస్వరంతో....

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా బల్లికురవ కోనిదన సూరేపల్లి వైదన ముక్తేశ్వరం గుంటుపల్లి శివాలయాలలో వేకువజామున నాలుగు గంటల నుండి భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు సందర్శించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధ లతో కార్తీకదీపాలు వెలిగించి శివునికి పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శనానికి వస్తారని ముందు ఆలోచనతో శివాలయం పూజారి కుందుర్తి శ్రీనివాసరావు ముందస్తు జాగ్రత్తలు చేపట్టి ఉన్నారు.

పూనురులో....

విశాలాంధ్ర - యద్దనపూడి : కార్తిక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తుల శివనామస్మరణలతో మారు మ్రోగాయి. మహిళలు వేకువజామున కార్తిక పుణ్య స్నానాలు ఆచరించి శివాలయాలను సందర్శించి కార్తీకదీపాలు వెలిగించి శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేశారు. పునూరు లోని త్రిపుర సుందరి సమేత త్రిపురాంతక స్వామి వారి దేవాలయంలో, యద్దనపూడి మల్లికార్జున స్వామి దేవాల యంలో, గన్నవరంలో చెన్నా మల్లికార్జున స్వామి ఆలయంలో, శివాలయం లలో పెద్ద ఎత్తున భక్తులు కార్తీక పూజలు చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు .ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

చెరుకుపల్లిలో.....

విశాలాంధ్ర - చెరుకుపల్లి : పరమ పవిత్రమైన కార్తీకమాసం అందులోను పౌర్ణమి ఇంక భక్తుల ఆనందోత్సవాలకు కేంద్ర బిందువు అయింది. ఉదయాన్నే భక్తులు దేవాలయాలలో దీపారాధనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేకమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండలం లోని శివాలయాలు భక్తుల ఓం నమశ్శివాయ నినాదంతో ప్రతిధ్వనించాయి. సాయంత్రం సమయంలో కార్తీక వ్రతాలు చేసుకుని భక్తులు, ఉదయాన్నుండి భక్తులతో దేవాలయాలు కిటకిటలాడాయి. స్థానిక బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అన్నపురెడ్డి సాంబశివరావు ఆధ్వర్యంలో జ్వాలాతోరణం, కోటి దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తుల సహాయ సహకారాలతో దేవాలయాన్ని కోటి దీపాలను వెలిగించి భక్తులు తరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా ఎస్సై టి అనిల్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు

విశాలాంధ్ర - సంతమాగులూరు : కార్తీకమాసం పురస్కరించుకొని సంతమాగులూరు మండలంలోని శైవక్షేత్రాల్లో పౌర్ణమి పూజలను భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఏల్చూరులోని బాలాలయం, కుందుర్రులో మల్లేశ్వరస్వామి, కొప్పరంలో త్రిపురాంతకేశుడు, బాలా త్రిపురసుందరిదేవి, సంతమాగులూరులోని శివాలయంలోని స్వామివార్లకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు కార్తీక దీపాలను వెలిగించి, భక్తి పారవశ్యం చాటారు.

ఆర్థిక అక్షరాస్యతా కళాజాత

విశాలాంధ్ర - కారంచేడు : నాబార్డు ఆర్థిక సహకారంతో ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమం కారంచేడులో నిర్వహించారు. చైర్మన్ కే.సీతారామయ్య, సీఈవో డి.వి.శర్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు బ్రాంచ్ మేనేజర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారులు ప్రజలకు సేవింగ్స్ అకౌంట్స్, గోల్డ్ లోన్స్, వ్యవసాయ రుణాలు, లాకర్ సదుపాయాలు మరియు బ్యాంకింగ్ సేవల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఆర్థిక వ్యవహారాల్లో జాగ్రత్తలు, సేవింగ్స్ అలవాటు, సురక్షితమైన బ్యాంకింగ్ పై ప్రజలకు సందేశాలు అందించారు. స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అధునాతన సాగుతో పెట్టుబడి తగ్గింపు

విశాలాంధ్ర - జె.పంగులూరు : మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా బుధ వారం బైటమంజులూరు, ముప్ప వరం గ్రామాలలో రైతులతో సమావేశం నిర్వహించి ఈ సమా వేశంలో మండల వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి పాల్గొని, పొలం పిలుస్తుంది ముఖ్య ఉద్దేశం అయినా అధునాతన పద్ధతులను ఉపయోగించి తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలని పురుగు మందులు, ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతులు ద్వారా పంటలు సాగు చేయడం వల్ల భూసారము పెరుగునని వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి తెలిపారు. ఈసమావేశంలో బైటమంజులూరు సర్పంచ్ తిరుమల రాజు నాయకులు శివరాజు మరియు జాగర్లమూడి వారి పాలెం పిఏసిఎస్ అధ్యక్షులు అల్లంనేని స్వాములు వ్యవసాయ సహాయకులు బీబీ జాన్, గోపి కిరణ్ రైతులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర-బాపట్ల: కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజా గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (పి జి ఆర్ ఎస్) కేంద్రాన్ని బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు నేరుగా ఫోన్ చేసి, వారు సమర్పించిన అర్జీల పరిష్కార స్థితి గురించి ఆరా తీశారు. ఒక అర్జీదారుడి సమస్యపై వేటపాలెం మండల తహసీల్దార్‌తో కలెక్టర్ స్వయంగా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకుగా వ్యవహరించాలని సూచించిన ఆయన, ఏ మాత్రం అలసత్వం వహించరాదని హెచ్చరించారు. ప్రతి తహసీల్దార్ తన లాగిన్‌లోకి వచ్చే ప్రజా అర్జీలను స్వయంగా పరిశీలించి, సమయానుకూలంగా పరిష్కరించాల్సింది గా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంటి పన్నులు వసూలు చేయాలి

- డి.డి.వో విజయలక్ష్మి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : గ్రామ పంచాయతీల్లో 2025-26 ఆర్థిక సంవత్సరం నుంచి ఇంటి పన్నులు వసూలు ఆన్ లైన్ ద్వారా మాత్రమే స్వీకరించాలని బాపట్ల డివిజనల్ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి చెప్పారు.బుధవారం బాపట్ల ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల తో డిడివో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఎంపిడిఓ బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డిడివో విజయలక్ష్మి మాట్లాడుతూ ఇంటి పన్నులు వసూలు నందు పారదర్శకత కోసం స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా ఆన్ లైన్ లో మాత్రమే స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజలకు అవగాహన కల్పించాలని, పన్నులు వసూలు కూడా వేగవంతం చేయాలని చెప్పారు. చేయాలని విజయలక్ష్మి తెలిపారు.

తీర ప్రాంతాన్ని మహేంద్రనాథ్ పరిశీలన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మొంథా తుఫాను తరువాత కోతకు గురి అయిన సముద్ర తీర ప్రాంతాన్ని తెలుగుదేశం పార్టీ చీరాల నియోజక వర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ పరిశీలించారు. స్థానికులతో, గజ ఈతగాళ్లతో మాట్లాడారు. వాడరేవు నుండి కోతకు గురి అయిన రహదారిని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వలన సముద్ర ప్రాంతం తీవ్ర కోతకు గురై ప్రమాదకరంగా మారిందన్నారు. భద్రత కారణాల రీత్యా, ఎటువంటి ప్రమాదాలు, దుర్ఘటనలు, ప్రాణ నష్టం జరగకుండా, సముద్ర తీర ప్రాంతంలో కార్తీక స్నానాలకు అనుమతించడం లేదన్నారు. భక్తులు, పర్యాటకులు, ప్రజలు గమనించి సహకరించ వలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు మండలంలోని పలపట్ల గ్రామ పరిధిలో ఉన్న సమితి కార్యాలయ భవనాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలపై బుధవారం పంచాయతీ రాజ్ డీఈ, ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఇతర సంబంధిత అధికారులతో టీడీపీ నేత అనగాని శివప్రసాద్ చర్చించారు.యార్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను అనగాని శివప్రసాద్ సూచించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలపట్ల గ్రామంలో మార్కెట్ యార్డు నిర్మాణం రూపుదిద్దుకుంటే ఈ తీర ప్రాంత రైతులకు తమ పంటల విక్రయానికి అనుకూలంగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో కూచినపూడి మార్కెట్ యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్ యాదవ్, రేపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కొలసాని రాము, టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, బొర్రా సురేంద్ర, కేసన రామకృష్ణ, శొంఠి శ్రీనివాసరావు, పిన్నిబోయిన చింతారావు తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి ప్రతిభ పరీక్ష

విశాలాంధ్ర - నిజాంపట్నం : జన విజ్ఞాన వేదిక మండల స్థాయి చెకుముకి ప్రతిభ పరీక్షను నిజాంపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జేవీవీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు దబ్బకూటి హరిబాబు సమక్షంలో నిర్వహించారు.ఈ పరీక్షల్లో మండలంలోని 13 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ స్థానాలలో నిలిచిన ఆయా పాఠశాలల విద్యార్థులకు నవంబర్ 23న జరిగే జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారని జేవీవీ మండల అధ్యక్షుడు కుమార్ తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో నిజాంపట్నం జడ్పీ హై స్కూల్ హెచ్ఎం పి.శివన్నారాయణ, ఉపాధ్యాయులు రవికుమార్, వెంకటేశ్వరరావు, కిరణ్, గణేష్, సత్యనారాయణ, శివశంకర్, వెంకట స్వామి, శ్రీను, ఆంజనేయులు, రత్నరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మారుమ్రోగిన శివాలయాలు

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలో పలు దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించారు.ఆలయాలు పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. బొద్దికూరపాడు శ్రీ గంగా పార్వతి వర్ధిణి , శివరామపురం, లక్కవరం , మాధవరం, తాళ్లూరు, గుంటి గంగా భవాని , తూర్పు గంగవరం శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుండే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసారు. సాయంత్రం బొద్దికూరపాడు , తాళ్లూరులలో లక్ష దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహించారు. తాళ్లూరులో లింగేశ్వర స్వామి ఆలయాన్ని సబ్ కలెక్టర్, మండల ప్రత్యేక అధికారి ఎ కుమార్, ఎంపీడీఓ అజిత , తహసీల్దార్ రమణా రావు సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి శివాలయంలో ....

విశాలాంధ్ర-కురిచేడు : స్థానిక శ్రీకాళహస్తీశ్వర స్వామి శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భముగా బుధవారం తెల్లవారుజాము నుండి హర హర మహాదేవ శంభో శంకర భక్తులు అంటూ మారు మ్రోగాయి. భక్తులు శివపార్వతులను దర్శించుకుని భక్తితో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేళ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉపవాస దీక్షతో ఒత్తులతో కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తి చాటుకున్నారు. అభిషేకాలు కుంకుమార్చనలు నిర్వహించారు.

శ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో

విశాలాంధ్ర - బేస్తవారిపేట : కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాలు శివ నామస్మరణతో మారు మ్రోగాయి. ఈ సందర్భంగా భక్తులు శివాలాయలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక చిన్న కంభం వెళ్లే రహదారిలో వెలసిన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాశీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో పూజారి నరేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి, అమ్మవారికి ఉదయం అభిషేకాలు, కుంకుమ పూజ, అనంతరం సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆటో...ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికీ తీవ్రగాయాలు

విశాలాంధ్ర -కంభం : ఆటో టూ వీలర్ ను ఢీ కొనటంతో టూవీలర్ పై ఉన్న వ్యక్తికి త్రీవంగా గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసు కుంది. సమాచారం మేరకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఫై.ప్రకాష్ ను పట్టణంలోని ఎబిఎం చర్చి ముందు ఎదురుగా వస్తున్నా ఆటో ఒక్కసారిగా టూవీలర్ పైకి దూసు కెళ్ళింది. దింతో టూవీలర్ పై ఉన్న ప్రకాష్ కిందపడటం తో తలకు, కంటి కింద త్రీవంగా గాయపడ్డాడు .అక్కడేఉన్న స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం పై క్షత గాత్రునికి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కదిరి

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరి పట్టణానికి చెందిన బత్తుల రుషేంద్ర కుమార్ కుమారుడు హేమరాజ్, దివ్య వాణిల వివాహ రిసెప్షన్ వేడుక బుధవారం కనిగిరి పట్టణం లోని పవిత్ర ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.

వెలుగువారిపాలెం, రామభద్రాపురంల్లో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర -తాళ్లూరు: ప్రతి కూల వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలు తీవ్రమైన గాలులు ఊహించని చలి వంటి తీవ్ర పరిస్థితులు ఎదురైనప్పుడు మొక్కలు తీవ్ర ఒత్తిడికి గురవుతాయని వ్యవసాయాధికారి ప్రసాద రావు తెలిపారు. వెలుగు వారి పాలెం , రామభద్రాపురంలలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచ గవ్య ద్వారా కొత్త పిలకలు, ఆకులు పెరుగుదల ప్రారంభమౌతుందని తెలిపారు. గాలి వలన కలిగిన నష్టాన్ని పూడ్చి పూత ,పిందే రాలిపోకుండా నిలబెట్టటానికి ఉపయోగపడుతుదని తెలిపారు. కార్యక్రమంలో విఏఏ ఆదినారాయణ రైతులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను మేరుగ నాగార్జున పరామర్శ



విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం బండ్లమూడి గ్రామ మాదిగల పై అదే గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణ కులస్తులు దాడి చేయగా తీవ్రమైన గాయాలతో ఒంగోలు రిమ్స్ ఆస్తిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి వారిపై జరిగిన దాడిని ఖండించిన మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త మెరుగు నాగార్జున.ఒంగోలు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి చుండూరు రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలన బొట్ల రామారావు కె.వి.రమణారెడ్డి, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు,జడ్పిటిసి వేమా శ్రీనివాస రావు,మండల వైసిపి అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, వీరి వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండల ప్రజా పరిషత్ నందు బుధవారం ఎస్ సునీల్ బాబు, డెప్యూటీ ఎంపీడీఓగా నూతన బాధ్యతలు స్వీకరించారు. టంగుటూరు మండలం ఆలకూరపాడు గ్రామపంచాయతీ గ్రేడ్-1 పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తూ పదోన్నతి పై నాగులుప్పలపాడు మండలం నకు నియమితుల య్యారని, ఎంపీడీఓ తేళ్ళ. రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మద్యం మత్తులో యువకుడి మృతి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మద్యం మత్తులో యువకుడు మృతి చెందిన దారుణ ఘటన పుల్లల చెరువు మండలంలోని ముటుకుల గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే, శతకోడు గ్రామానికి చెందిన మాకం నాసరయ్య వయసు సుమారు 40 సంవత్సరాలు. మద్యం సేవించిన అనంతరం ముటుకుల గ్రామంలోని చికెన్ కొట్టు సమీపంలో ఉన్న కాలువలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు తెలుస్తోంది.గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు జీవనోపాధి కోసం నల్గొండకు పత్తి కూలీ పనికి వెళ్లి, ఇటీవల పింఛన్ కోసం స్వగ్రామానికి వచ్చాడు. పింఛన్ ద్వారా వచ్చిన నగదుతో గత రెండు రోజులుగా మద్యం సేవిస్తూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో కాలువలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

CHANGE OF SURNAME

I, **NULLA PADMAJA** (Old Name), W/o. **NULA VENKAT RAO**, Resident of Door No.4-11, Poluru Village, Yaddanapudi Mandal, Prakasam District (Present: Bapatla District), Andhra Pradesh - 523171. I have changed my surname as **NULA PADMAJA** (New Name) W/o. **NULA VENKAT RAO**. Hereafter my surname is known as **NULA PADMAJA** (New Name) W/o. **NULA VENKAT RAO**.

CHANGE OF SURNAME

I, **NULLA VENKAT RAO** (Old Name), S/o. **NULA SINGAIAH**, Resident of Door No.4-11, Poluru Village, Yaddanapudi Mandal, Prakasam District (Present: Bapatla District), Andhra Pradesh - 523171. I have changed my surname as **NULA VENKAT RAO** (New Name) S/o. **NULA SINGAIAH**. Hereafter my surname is known as **NULA VENKAT RAO** (New Name) S/o. **NULA SINGAIAH**.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL
D.No.31-31-21, SRI SAI BABA STREET, DABAGARDENS, VISAKHAPATNAM.

O.A. No. 873 / 2025

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Between :
INDIAN BANK, Repalle Branch,Repalle, Rep. by its Branch Manager. ...APPLICANT

And:
1.Ghanta Anasuya, W/o. Late Srinivasa Rao.
2.Ghanta Phani Kumar, S/o. Late Srinivasa Rao.
3.Ghanta Divya Sri, D/o. Late Srinivasa Rao. All are R/o. 7-129, 11th Ward, Main Road, Peteru, Repalle Mandal - 522265. ...DEFENDANTS

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

WHEREAS the applicant has instituted an application U/S 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act.1993 against you for the recovery of some mentioned therein together with current and future interest and other reliefs. You are here by summoned to appear and file Written statement before this tribunal at **10.30am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **09-12-2025** to answer the claim. If you intend to file any documents, you may file the same with a list along with the written statement. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed. Take notice that, in default of, your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.

REGISTRAR, DEBTS RECOVERY TRIBUNAL, VISAKHAPATNAM

HIGH COURT OF KARNATAKA BENGALURU
MFA NO. 346/2025 (KPIDFA)

Between :
Sri D.Ravindra ... Applicant
V/s
Respodents:
M/S Mythri plantation and horticulture private limited, Represented by
Sri Lakku Konda Reddy
Sri K.Brahma Reddy
Sri Lakku Malyadri Reddy

COURT NOTICE

To take notice that the notice in MFA NO. 346/2025 (KPIDFA - SJ)

Notice is hereby given to you to appear in this court is person or through an advocate daily instructed or through some one authorised by law to act for you in this case on **28-11-2025 at 10-30 AM** in case you intend to contest the appeal if you fail so to appear the appeal will be dealt with heard and decided in your absence.

By order of the court
HIGH COURT OF KARNATAKA BENGALURU

Sri Athma V Hiremath, Advocate
No.521, 53rd cross
near Rama mandir temple
3rd block Rajajinagar, Bengaluru- 10
Contact number 098865 07917

తుఫాను పరిహారం వెంటనే పంపిణీ చేయాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

విశాలాంధ్ర - బాపట్ల : మొంథా తుపానుకు నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని తక్షణమే పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. నష్టపరిహారం పంపిణీపై బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలని కలెక్టర్ చెప్పారు. పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన 9,956 మంది బాధితులకు నగదు, నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం ప్రకటించినట్లుగా 13వేల 74 మంది మత్స్యకారులకు, 8,260 మంది చేనేతలకు పరిహారాన్ని పంపిణీ చేయాలన్నారు. పరిహారం పంపిణీలో జాప్యం చేయరాదన్నారు. విధి నిర్వహణలో నిర్లిప్తంగా ఉంటే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు. పరిహారం నగదును నేరుగా అర్హులైన వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలన్నారు. 24 గంటల్లో పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైస్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. పంట నష్టం అంచనాల సర్వే వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 18 వేల 486 మంది రైతుల భూములు సర్వే చేసినట్లు వివరించారు. 36,818 ఎకరాల భూమిలో పంటలకు నష్టం జరిగిందన్నారు. 12,888 ఎకరాల భూమిలో పంటలు దెబ్బతిన్నాయని ధ్రువకరిస్తూ అధికారులు అధికారికంగా నివేదించారన్నారు. మిగిలిన ప్రాంతాలలో సర్వే ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. గతేడాది పొగాకు పంట సాగు చేసిన వారి పొగాకు పంట పొలంలోనే ఉండి తడిసిపోతే వాటిని ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. పొగాకు పంట నష్టం వివరాలు స్పష్టంగా నివేదించాలన్నారు. పొగాకు పంటపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఈ క్రాప్ బుకింగ్ లో ఇప్పటివరకు బాపట్ల జిల్లాలో 1,66,263 ఎకరాల పంటల సాగు వివరాలను నిక్షిప్తం చేశామన్నారు. ఈ క్రాప్ నమోదుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. 1,060 గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, వ్యవసాయ శాఖ ఏడి అన్నపూర్ణ, డీఎస్ఓ జమీర్ బాషా, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి రమేష్ బాబు, మార్క్ ఫెడ్ జీఎం కరుణశ్రీ, తహసిల్దార్లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత

విశాలాంధ్ర - కర్లపాలెం : కర్లపాలెం పంచాయతీలోని టీడీపీ పార్టీ కార్యకర్త కనమర్లపూడి అజయ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా నామిని అయిన వారి అమ్మకు 5 లక్షలు రూపాయిల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షులు ఏపూరి భూపతిరావు మాట్లాడుతూ పార్టీకి వెన్నంటి ఉండి నడిచిన వారిని కష్టకాలంలో ప్రభుత్వం ఆదుకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాజి, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాష, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, కుమ్మరికుంట దాస్, బుల్లియ్య, పిట్ల వసంతరెడ్డి, కట్టా సుజాత, బొద్దుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమీషన్‌కు కలిసిన కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : సూర్యలంక హరిత రిసార్ట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నీలం సాహ్ని వ్యక్తిగత పర్యటన నిమిత్తం బుధవారం వచ్చారు. ఈ నేపథ్యంలో బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నీలం సాహ్నిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - బాపట్ల : కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన దుర్ఘటన బాపట్ల చీరాల జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. చీరాల వైపు నుంచి బాపట్ల సూర్యలంక ఫ్లైఓవర్ వద్ద పట్టణంలోకి వచ్చే క్రమంలో కారు బైక్‌పై వస్తున్న వ్యక్తిని బలంగా ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనదారుడు కాలు పూర్తిగా తెగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఇమ్మడిశెట్టి వారిపాలెం గ్రామానికి చెందిన ఆంజనేయులుగా వ్యక్తిగా గుర్తించారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - కర్లపాలెం : మోటారు వాహనాలను నడిపేవారు పరిమిత వేగంతో నడపాలని ద్విచక్ర మోటార్ వాహనాలపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కర్లపాలెం ఎస్సై రవీంద్ర చెప్పారు. ఎస్పీ ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం కర్లపాలెం కూరగాయల మార్కెట్ వద్ద జాతీయ రహదారిపై ప్రజలకు అవగాహన కల్పించారు. రవీంద్ర మాట్లాడుతూ కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అవగాహన కల్పించారు. పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలను చేరుకోవాలని చెప్పారు.

ఘనంగా పంచ మండపాల పడిపూజ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కార్తీక మాసంలో అయ్యప్ప మాలలు ధరించిన భక్తులు 41 రోజులు నిష్టగా అయ్యప్పను ధ్యానం చేస్తూ దీక్షలో ఉంటారు. స్థానిక వీర రాఘవపేటకు చెందిన తిర్లిక వెంకటప్రసాద్ స్వామి 18వ పడి సందర్భంగా తెనాలి రోడ్డు లో ని బస్టాండ్ ఆవరణలో పంచ మండపాల పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిగుండం, సలసల కాగే నూనెలో స్వాములు చేతులు పెట్టడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పూసడపు కృష్ణ ప్రసాద్ గురు స్వామి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. నడింపల్లి కి చెందిన బాలయ్య స్వామి ఆర్కెస్ట్రా తో ఆలపించిన పాటలు ఆహుతులను అలరించాయి. అనంతరం స్వాములకు, భక్తులకు బిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.

పాకల సముద్రం తీరాన దీపాలతో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సింగరాయకొండ : కార్తీక పౌర్ణమి సందర్భంగా సింగరాయకొండ మండల పరిధిలోని పాకల సముద్రపు తీరాన బుధవారం తెల్లవారుజాము నుండి శివనామస్మరణతో స్త్రీలు స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి పూజల నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలం చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు విరివిగా పాల్గొన్నారు. పాకల శివాలయంలో తెల్లవారు జాము నుంచి సముద్ర స్నానాల ఆచరించి, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించి భక్తులు శివనామ స్మరణతో భజనలు చేసి భక్తులు భక్తిని చాటుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సింగరాయకొండ సిఐ హజరత్తయ్య, ఎస్సై మహేంద్రా రక్షణగా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశారు.

అదేవిధంగా రెవెన్యూ యంత్రాంగం, సచివాలయం సిబ్బంది పర్యవేక్షణలో ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది.

త్వరలో శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రారంభం

విశాలాంధ్ర-సిఎస్‌పురం : సిఎస్ పురం మండలంలోని శీలంవారిపల్లె, కోవిలంపాడు, సిఎస్ పురం కూడలిలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పనులను కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల చైర్మెన్ కెవి ప్రకాశ్ రావు, సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి పరిశీలించారు. ఈ సందర్భంగా కదిరి బ్రదర్స్ మాట్లాడుతూ దేవస్థానం పనులు వేగవంతం చేసి త్వరలో ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసిలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మెన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, కొట్టె శ్రీను, తికణం బాబురావు, పట్నం తిరుపతయ్య, కళాశాల ఇంజనీర్ నిమ్మల శ్రీనివాసులు, అన్నంగి కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

తుఫాను నష్టం షర్మిలకు తెలిపిన నాగబాబు

విశాలాంధ్ర - రేపల్లె : మొంథా తుఫాన్‌కి మత్స్యకారులు, ఆక్వా రైతులు, ఎంతో భారీగా నష్టపోయారని రేపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొప్పనాతి నాగబాబు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షురాలైన షర్మిలను కలసి మత్స్యకారులు, ఆక్వా రైతులు నష్టాలు గురించి వివరించారు. కాంగ్రెస్ నాయకులు, స్వామి నారాయణమూర్తి, రామనాథం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాజీపాలెంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని ఖాజీపాలెం గ్రామంలో గురువారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పిట్టల వానిపాలెం విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఖాజీపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఖాజీపాలెం టౌన్ ఫీడర్‌పై మరమ్మత్తుల పనులు నిర్వహించనున్నందున ఈ తాత్కాలిక అంతరాయం ఏర్పడు తుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా 'బొల్లా' వివాహ వేడుకలు

విశాలాంధ్ర-పామూరు : టీడీపీ మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు వివాహ వార్షికోత్సవ వేడుకలను స్థానిక మహాలక్ష్మి మిల్క్ డైరీ లో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. నరసింహారావు దంపతుల కేక్ కట్ చేశారు. ఈ వేడుకలలో టీడీపీ నాయకులు, బొల్లా స్నేహితులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.